

విశాలాంధ్ర

శ్రీకాకుళం

శనివారం 10, మే 2025

పేజి నెం. 9

జవాన్ మృతిపై దిగ్ర్భాంతి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-టెక్కలి/కోటబొమ్మాళి: జమ్మూకాశ్మీర్ పాక్ కాల్పుల్లో రాష్ట్రంలోని సత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేస్తున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళి నాయక్ మృతి తీవ్రంగా కలిసి వేసిందన్నారు.

సియం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసి పత్రాన్ని ఎమ్మెల్యే ఎంజిఆర్ అందజేత

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ పరిధిలో గల రాళ్లక్వారీ వీధికి చెందిన పోతల సోమేశ్ అబ్బాయి పోతల విజయ్ కిడ్నీ సంభందించిన సమస్యతో బాధపడుతూ వైద్యం చేయించుకునే స్థోమత లేకపోవడంతో పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు వద్ద విన్నవించుకోగా ముఖ్యమంత్రి సహాయానిదికి దరఖాస్తు చేయించి వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.4 లక్షలు రూపాయిలు ఎల్‌ఓసి)పత్రాలను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివిధ రకాల వ్యాధులకు వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఉదారంగా ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్న ప్రభుత్వం ఈ ఎన్డీఏ ప్రభుత్వం అని తెలియజేశారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా నిధులు అందిస్తున్నామన్నారు. అలాగే ఈ నియోజకవర్గంలో గత పాలకులు ఏరోజైనా సీఎం సహాయనిది కోసం ఒక్క దరఖాస్తు అయిన చేయలేదని నియోజకవర్గ ప్రజలకు ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఐతమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర-టెక్కలి : ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్ హెచ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ విధులు నిర్వహిస్తున్న అల్లు ఉదయశ్రీకు వీర్ సురేంద్ర సాయి యూనివర్శిటీ ఆఫ్ టెక్నాలజీ, బుర్లా, ఒడిస్సా కెమిస్ట్రీ విభాగంలో పిహెచ్‌డి పట్టాను మంజూరు చేసిందని ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే యూనివర్శిటీ కెమిస్ట్రీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ రామకృష్ణ డి.ఎస్. మార్గదర్శకత్వంలో నోవెల్ ఫిరిమిడైన్ స్కాఫోల్డ్స్ బేస్డ్ గ్రీనర్ సింతసిస్ ఆఫ్ రిబోసైక్లిక్ వయా నైట్రోజన్ కంటైనింగ్ హెటరో న్యూక్లియర్ మొలెక్యూల్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టర్ అల్లు ఉదయశ్రీకి ఈ పిహెచ్ డిగ్రీ జారీఅయిందన్నారు. పిహెచ్ సాధించిన డాక్టర్ ఉదయశ్రీకి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆరెడ్డీ డాక్టర్ డి. శ్రీరాములు, హెచ్ఐడిలు డాక్టర్ ఎం. వి. రత్నమణి, డాక్టర్ ఎం. రమణయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

నవధాన్యాల సాగుతో నేలకు ప్రయోజనం

విశాలాంధ్ర-సోంపేట : నవధాన్యాలు సాగు వలన నేలకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని ప్రకృతి వ్యవసాయ ఇన్‌చార్జ్ సింగుపురం కుమారి పేర్కొన్నారు. మండలం పలాసపురం గ్రామంలో శుక్రవారం కట్టెజనుము, జీలుగ, ఉల్లిపెసర, మొదలైన 32 రకాల విత్తనాలతో తయారు చేసిన కిట్లును రైతులకు అందజేశారు. వీటిని పొలాల్లో దుక్కిలో చల్లి 55 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నాలని లేదా పశుగ్రాసంగా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. దీని వలన నేల గుల్లబారడం, వానపాములు వృద్ధి చెందడం, నీటి నిల్వ సామర్థ్యం పెరగడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో విఏఏ జీవిత, ఎపిఎం రమణమ్మ, పలువురు రైతులు పాల్గొన్నారు.

మందస ఎంపీడీఓగా వెంకటరమణ

విశాలాంధ్ర-మందస : మందస ఎంపీడీఓగా వై.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీకాకుళం మండల పరిషత్ లో పరిపాలన అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై పూర్తిస్థాయి మండల పరిషత్ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇంచార్జి ఎంపీడీఓగా వ్యవహరించిన ఎస్.రమేష్ నాయుడు నుంచి ఈయన బాధ్యతలు స్వీకరించారు. ఈయనకు మందస మండల పరిషత్ పరిపాలన అధికారి బి. రుషేశ్వరరావు, ఈఓ ఆర్డీ జయప్రకాశ్, టైపిస్ట్ ధనలక్ష్మి మరియు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికుల అవస్థలు

విశాలాంధ్ర-జలుమూరు : మండలం చల్లవానిపేట జంక్షన్‌లో శుక్రవారం మధ్యాహ్నం ట్రాఫిక్ జామ్ జరగడంతో ప్రయాణికులు పలు అవస్థలు పడ్డారు. తిలారు రైల్వే గేట్ సమీపంలో ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నందున ట్రాఫికను తిలారు వైపు వెళ్లకుండా జర్జంగి మీదుగా నరసన్నపేట వెళుతున్నందున శ్రీముఖలింగం ఉంటే బస్సులు పాతపట్నం నుండి వచ్చే వాహనాలు ఒక్కసారిగా ఇక్కడ జామ్ అవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.

పలాస కోర్టు భవన నిర్మాణంకు నిధులు మంజూరుకి కృషి చేయాలి

పలాస ఎమ్మెల్యే శిరీషకు న్యాయవాదులు వినతి

విశాలాంధ్ర-పలాస : పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నూతన భవనం నిర్మాణానికి నిధులు మంజూరుకై కృషి చేయాలని పలాస బార్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాజ్ అహ్మద్(గని) ఆధ్వర్యంలో న్యాయవాదులు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ పలాస కోర్టు నూతన భవనం నిర్మాణం కు సంబందించి గత ఏడు, ఎనిమిది సంవత్సరాలుగా టెండర్ లు వరకు వచ్చి నిర్మాణం పనులు జరగకుండా నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి డా.సిదిరి. అప్పలరాజు నిర్లక్ష్యం కారణంగా పనులు ఆగిపోయాయని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున, ఆగిపోయి ఉన్న కోర్టు భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరుకు కృషి చేయవలసిందిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను కోరారు. దీనిపై శిరీష వెంటనే స్పందిస్తూ రోడ్లు మరియు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్‌తో సంప్రదించారు. నూతన కోర్టు భవనం నిర్మాణంకు సంబంధించిన నిధులు 5.90 కోట్ల రూపాయలు హైకోర్టులో పెండింగ్ లో ఉన్నాయని చీఫ్ ఇంజనీర్ ఎమ్మెల్యే శిరీష కు తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి ఫరూక్ దృష్టికి ఎమ్మెల్యే శిరీష తీసుకువెళ్లారు. కోర్టు నూతన భవన నిర్మాణంకు సంబంధించి వివరాలను పంపించాలని కోరగా వెంటనే న్యాయవాదులు అందజేసిన వినతి పత్రంను ఫాక్సు ద్వారా మంత్రి కార్యాలయానికి ఎమ్మెల్యే శిరీష పంపించారు. నిధులు మంజూరుకు సంబంధించి వారం రోజుల్లో సమాచారం అందిస్తామని బార్ అసోసియేషన్ సభ్యులకు శిరీష తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బి.కె.ఆర్. పట్నాయక్, కె. రజీని కుమార్, జి. ప్రభాకర్, పి. చిట్టీబాబు, టి.శామ్, రవికుమార్ పట్నాయక్, తదితరులు ఉన్నారు.

పారా లీగల్ వాలంటీర్లుగా నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

- ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోండి
- సీనియర్ సివిల్ జడ్జి బి. నిర్మల

విశాలాంధ్ర-టెక్కలి : ఆశక్తి గల అభ్యర్థుల నుండి పారా లీగల్ వాలంటీర్లుగా నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి బి. నిర్మల శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు మరియు వృద్దులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు/ఫిజీషియన్స్, విద్యార్థులు మరియు న్యాయ సంబంధిత విద్యార్థులు (న్యాయవాదులగా నమోదైనంతవరకు), రాజకీయేతర సభ్యులు, సేవాదృక్పదమ్ కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు, మైత్రి సంఘ సభ్యులు, ఇతర స్వయం సహాయక సంఘ సభ్యులు, విభిన్న సామర్థ్యం గల వ్యక్తులు, ట్రాన్సజెండెర్లు, సీనియర్ సిటిజన్లు వాలంటీర్లు గా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేయదలచిన వారు పదవ తరగతి/ మెట్రిక్యులేషన్ అర్హత కలిగి ఉండాలని, మరియు టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి రెవిన్యూ మండలాల పరిదిలో నివాసితులై ఉండాలన్నారు. ఆశక్తి గల అభ్యర్థులు రెండు పాస్ పోర్టు సైజు కలర్ ఫోటోలు, ఆధార్ కార్డు మరియు విద్యా సంబంధిత పత్రములుతో టెక్కలి మండల న్యాయసేవాధికార సంఘం కార్యాలయంలో ఉదయం గం.10-30 ని నుండి సాయంత్రం గం.5-00 ల వరకు తే 14-05-2025 ది బుధవారం లోగా సంప్రదించకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులును సమర్పించుటుకు తే 14-05-2025 ది బుధవారం ఆఖరుతేదీగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. పారా లీగల్ వాలంటీర్లుగా నియమితులైన వారికి ఎటువంటి జీతభత్యములు గాని, పారితోషకములు గాని మరియు వేతనములు గాని చెల్లించబడవని ఆమె తెలియజేశారు.

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ నడిపెన రామారావు

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ నడిపేన రామారావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోగల సచివా లయంల ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో గల అక్రమ కట్టడాలను గుర్తించి వాటిపై స్థానిక కోర్టులో కేసులు నమోదుచేసి పురపాలక సంఘ ఆదాయంను మెరుగుపరచ వలసిందిగా కోరారు. పురపాలక సంఘంలో ఇంటి నిర్మాణం చేస్తున్న గృహ యజమానులను గుర్తించి ప్రతి వారితో కూడా బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టించి వారికి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌పై అవగాహన కల్పించ వలసిందిగా సూచించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకొనుటకుగాను ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది కూడా సహకరించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘము పరిధిలోని అన్ని సచివాలయంల ప్లానింగ్ కార్యదర్శిలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ గౌరవ అధ్యక్షులు టి. తిరుపతిరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. రాష్ట్రవ్యాప్త పోరాటాల సందర్భంగా శ్రీకాకుళం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నల్లరంగు రిబ్బనులతో వారి నిరసనలు తెలిపారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇంజనీరింగ్ కార్మికులకి న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ మొండి వైఖరిని ఎండగడతామన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్, నాన్-టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలన్నారు. సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. రిటైర్మెంట్ వయసు 60 నుండి 62కి పెంచాలని,పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఇంజనీరింగ్ కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటాలు మరింత ఉదృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శి శ్యామలరావు, సతీష్, నాయకులు ముఖేష్ యాదవ్, శంకర్, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు కల్పించటమే కూటమి ధ్యేయం

ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట: రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించటమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పి.జి కళాశాలలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, రమణమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో గత మూడు నెలల కాలంలో జిల్లాలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 1,327మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించటం జరిగిందన్నారు. నేడు జరిగిన జాబ్ మేళాలో ప్రతీ ఒక్కరూ ఏదో ఒక పరిశ్రమలో చేరాలని, తద్వారా భవిష్యత్తులో అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రిన్సిపాల్, డా.పి.లత, కళాశాల అధ్యాపకులు, టిడిపి నాయకులు, గొద్దు చిట్టిబాబు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం : తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీకి ఈ నెల 7 నుండి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించిందని పలాస తహసిల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ ఈ కొత్త రేషన్ కార్డులకు అర్హులైన వారు నిబంధనలు పాటిస్తూ నిర్ణీత సమయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజాసాధికార సర్వేలో పేర్లు నమోదు అయిన వారు మాత్రమే ఈ దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని, దరఖాస్తుదారులు రాష్ట్రానికి చెందిన స్థానికులై ఉండాలన్నారు. అలాగే వారి ఆధార్ కార్డులో ఉన్న చిరునామా, వారు నివసిస్తున్న గ్రామానిదై ఉండాలని మ్యాపింగ్ అయిన వార్డ్ సచివాలయం పరిధిలోనే దరఖాస్తు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు బియ్యం కార్డు పొందని కుటుంబాలు మాత్రమే కొత్త కార్డుకు అర్హులని, కుటుంబ సభ్యుల చేర్పు కోసం తగిన ఆధారాలు ఇవ్వాలని సూచించారు. పిల్లల కోసం పుట్టిన తేదీ ధృవపత్రం, వధువును చేర్చాలంటే పెళ్లి ధృవపత్రం లేదా ఆధార్ కార్డులో భర్త పేరు ఉండాలన్నారు. కార్డు విభజన అవసరమైతే, ప్రజాసాధికార సర్వేలో వేర్వేరు కుటుంబాలుగా నమోదు అయి ఉండాలని, మృతి చెందిన వారి పేర్లను మాత్రమే కార్డు నుంచి తొలగించవచ్చని తెలిపారు. ఇతరులకు సంబంధించి ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినపుడే చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. ఆధార్ సీడింగ్ ప్రక్రియలో తప్పులు ఉంటే, దరఖాస్తుదారులు కొత్త ఆధార్ మొదట మ్యాపింగ్ చేసి తరువాతే ఆధార్ నంబర్ ను సీడ్ చేయవలసి ఉంటుందని, అభ్యర్ధనను కుటుంబ పెద్ద వేలిముద్ర ధృవీకరణతోనే సమర్పించాలన్నారు. కార్డు అవసరం లేని వారు స్వచ్ఛందంగా తమ కార్డును సరెండర్ చేయవచ్చని, ప్రజలు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా లేదా వార్డ్ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేయాలంటే 9552300009 నంబరుకు మెసేజ్ పంపిస్తే. అర్హతను తనిఖీ చేసిన తర్వాత, దరఖాస్తు ఫారం నింపి అవసరమైన డాక్యుమెంట్లను అప్లోడ్ చేయాలన్నారు. దరఖాస్తు స్థితిని కూడా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చని, వార్డ్ సచివాలయాన్ని సందర్శించి ఫారం పొందిన తర్వాత, సంబంధిత పత్రాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అవసరమైన డాక్యుమెంట్లలో కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, నివాస రుజువు (విద్యుత్ బిల్లు లేదా ఓటర్ కార్డు), ఆదాయ ధృవీకరణ పత్రం, బ్యాంక్ ఖాతా వివరాలు, పాస్ పోర్ట్ సైజు ఫోటోలు ఉంటాయని, ఈ కొత్త రేషన్ కార్డులు కోడ్ ఆధారిత స్మార్ట్ కార్డులు గా జారీ చేయబడతాయని తెలిపారు. వీటితో దేశవ్యాప్తంగా రేషన్ పొందే సౌకర్యం కలుగుతుందన్నారు. మోసాలను నివారించడమే కాక, ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయడమే ఈ విధానం ఉద్దేశమని తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైన తేదీ ఈ నెల 7 కాగా, చివరి తేదీ ప్రారంభం నుంచి 30 రోజుల్లోపు పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. ఇంతవరకు రేషన్ కార్డు లేనివారికి ఇది ఒక మంచి అవకాశం అంటూ తహసీల్దార్ కళ్యాణ చక్రవర్తి పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక

విశాలాంధ్ర-రణస్థలం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రణస్థలం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వ హించారు. ప్రజల వినతులు స్వీకరించి వాటిని పరిష్కారించే విధంగా ఆయా శాఖల అధికారులకు స్థానిక శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వర రావు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఈశ్వరరావు మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకువచ్చిన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమం యొక్క ఉపయోగం గురించి, సదరు పీజీఆర్ఎస్ ద్వారా వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎలా పరిష్కరించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు నుండి 126 అర్జీలు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్టేట్ రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము, కూటమి నాయకులు ముప్పిడి సురేష్, బెండు మల్లేశ్వరరావు, కుమరపు రవికుమార్, డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి బానోజనాయుడు, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పార్సిల్ సర్వీస్‌ను వినియోగించుకోండి

ఆర్టీసీ సహాయక రవాణా మేనేజర్ డి.దివ్య

విశాలాంధ-టెక్కలి : తక్కువ సమయంలో భద్రంగా ఆర్టీసీ నిర్వహిస్తున్న సరుకు రవాణా సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని ఆర్టీసీ సహాయక రవాణా మేనేజర్ డి.దివ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బస్ కాంప్లెక్స్ లో ఉన్న ఆర్టీసీ పార్సిల్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపియస్ ఆర్టీసీలో సరుకు రవాణా, కొరియర్ పార్సిల్ చార్జీలు తక్కువగా ఉండటంతో ఎక్కువమంది వినియోగదారులు ఆర్టీసీ పార్సిల్ సర్వీస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో భద్రంగా ఆర్టీసీ నిర్వహిస్తున్న సరుకు రవాణా సేవలను వినియోగదారులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. ప్రతి డిపోలో ఉదయం 07.00 గంటల నుండి రాత్రి 09.00 గంటల వరకు పార్సిల్ కార్యాలయలు తెరిచి ఉంటాయని అన్నారు. వినియోగదారులు ఎక్కువ మొత్తంలో సరుకు రవాణా చేయాలనుకుంటే డీజీటిలను అద్దె ప్రాతిపదకాన ఇవ్వానున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 73311 47260, 99081 90801, 70933 46220 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టెక్కలి, శ్రీకాకుళం డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ యస్ ఆర్ కుమార్, ఈజర్, ఎటిబి ఏజెంట్ కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీల్లో రేష్నలైజేషన్ ఉపాధ్యాయులకు అన్యాయం

ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎస్వీ రమణమూర్తి, జి.రమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తొలిసారిగా బదిలీల చట్టం ద్వారా చేపట్టనున్న టీచర్ల బదిలీలలో రేష్నలైజేషన్ టీచర్లకు అన్యాయం జరుగుతుందని ఎస్టీయు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు ఎస్వీ రమణ మూర్తి, జి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం చేపట్టిన పాఠశాల స్ట్రక్చర్‌లో మార్పులు కారణంగా తమ ప్రమేయం లేకుండానే టీచర్లు పెద్ద ఎత్తున రేష్నలైజేషన్ కు గురవుతున్నారని, వీరికి బదిలీల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వక పోవడం వల్ల వీరు జిల్లాలో దూర ప్రాంతాలకు బదిలీ అవ్వనున్నారన్నారు. వీరికి ప్రస్తుత పని చేస్తున్న స్టేషన్ పాయింట్లతో పాటు పాత స్టేషన్ పాయింట్లు కూడా 8 సంవత్సరాలకు మించకుండా ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.మూడు నాలుగు ఐదు తరగతులను సమీప పాఠశాలలో విలీనం చేయడం వల్ల అక్కడ పని చేస్తున్న ఎస్జీటీలు, ప్రాథమికోన్నత పాఠశాలలలో ఆరేడు ఎనిమిది తరగతులను తొలగించి ప్రైమరీగా డిగ్రేడ్ చేయడం వల్ల అక్కడ పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లు, ఉన్నత పాఠశాల నుండి మూడు నాలుగు అయిదు తరగతులు వెనక్కి రావడం వల్ల అక్కడ పనిచేస్తున్న కొంతమంది స్కూల్ అసిస్టెంట్లు రేష్నలైజేషన్ అవుతున్నారన్నారు. వీరి విషయంలో ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏకపక్ష వైఖరితో ముందుకు వెళ్లడం సరికాదని వారికి పాత స్టేషన్ పాయింట్లు కూడా ఇచ్చి బాధిత ఉపాధ్యాయుల న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రజా శ్రేయస్సు కోసం పని చేయాలి : ప్రభుత్వ విప్ అశోక్, ఎమ్మెల్సీ రామారావు



విశాలాంధ్ర-కవిటి : యువజన సంఘాలు ప్రజా శ్రేయస్సు కోసం పనిచేయాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం కవిటి ఉషోదయ యువజన సంఘం కార్యవర్గం లోల్ల నారాయణమూర్తి కళ్యాణ మండపంలో ప్రమాణస్వీకారం మహోత్సవంలో పాల్గొని వారు మాట్లాడుతూ యువజన సంఘాలు చొరవతోనే గ్రామాల అభివృద్ధి చెందుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. యువజన సంఘాలు యువతకు అభివృద్ధికి సహాయపడతాయని సామాజిక సంబంధాలను ఏర్పరుచుకోవడానికి మరియు సమాజానికి ఉపయోగపడే పనులు చేయడానికి ఒక వేదికగా యువజన సంఘాలు ఉంటాయని అన్నారు. కొన్ని దశాబ్దాలుగా ఉన్న ఉషోదయ యువజన సంఘం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని అలాంటి యువజన సంఘంలో యువత సభ్యులుగా చేరి సంఘ అభివృద్ధికి సహాయపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్, ఎంపిపి కడియాల పద్మ, వైస్ ఎంపీపీ పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపీపీ పూడి నేతాజీ, ఎఎంసీ చైర్మన్ బి.మణిచంద్ర ప్రకాష్, కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు,గౌరవ అధ్యక్షులు చిట్టిబాబు, పాండవ చంద్రశేఖర్,

గురుకుల ప్రవేశ పరీక్షల్లో అవలింగి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-జలుమూరు : ఏప్రిల్ నెలలో జరిగిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల ప్రవేశ పరీక్షల్లో సారవకోట మండలం అవలంబి జేబీతి పాఠశాల చిన్నారులు ఎంపికైనట్లు పాఠశాల వ్యవస్థాపకులు జోగు మహంతి మోహన్ గాంధీ తెలిపారు. బలగ సిద్ధార్థ యాభైకి 44, పొన్నన హర్షవర్ధన్ 50/37 మార్కులు సంపాదించి గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు మోహన్ గాంధీ తెలిపారు. ఐదో తరగతిలో గురుకుల పాఠశాలలో చేరుతున్నట్లు వీరికి గ్రామస్తులు ఉపాధ్యాయులు తెలిపారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్డు రైల్వే స్టేషన్ పరిధి ఆమదాలవలస పట్టణానికి సమీపంలో కుద్దిరాం రైల్వే గేటు వద్ద రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు జి ఆర్ పి ఎస్ఐ మధు సూదనరావు శుక్రవారం తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు 47 సంవత్సరాలు ఉంటుందని, చొక్కా బనియన్, ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ ప్రమాదం శుక్రవారం ఉదయం వేకువ జామున జరిగి ఉంటుందని తెలియజేశారు. ఉద యాన్నే పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ తరలించినట్లు తెలిపారు.

ఫోటో: పట్టాలపై పడి ఉన్న మృతదేహం: 09ఎస్‌కెఎల్‌ఎం13

ప్రతీ గర్భిణీకి వైద్య పరీక్షలు తప్పనిసరి

విశాలాంధ్ర-హిరమండలం : ప్రతీ గర్భిణీకి ప్రతీనెల వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయుంచుకోవాలని హిరమండలం పి హెచ్ సి వైద్యా ధికారులు డా ఫరూక్ హుస్సేన్, డా పి సాయి కుమార్ లు తెలిపారు. శుక్రవారం హిరమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పి ఎం ఎస్ ఎం ఎ కార్యక్రమం నిర్వహించి42 మంది గర్భిణీ స్త్రీ లకు వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు, అల్ట్రా సౌండ్ స్కన్‌లు జెమ్స్ వైద్యులు సహకారంతో నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యా ధికారులు మాట్లాడుతూ ప్రతీ నెల 9వ తేదిన ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ పథకం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో పి హెచ్ సి పరిధిలో ని ప్రతి గర్భిణీ స్త్రీ తప్పకుండా ఆయా పరిధిలోని ఆశా కార్యకర్త, ఎ ఎన్ ఎం ద్వారా వైద్య పరీక్షలు చేయుంచుకోవాలని పిలుపు నిచ్చారు. హిరమండలం సత్య సాయి సంస్థ భక్తులు గర్భిణీ లకు వైద్య సిబ్బందికి మధ్యాహ్న భోజన ఏర్పాట్లు ప్రతీ నెలలాగే శుక్రవారం కూడా చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పిహెచ్ఎన్, సిహెచ్ఓ టి రామారావు, హెచ్ వి రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోండి : కలెక్టర్



విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మిషన్ వాత్సల్య పథకం అమలుపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథలు, డ్రాప్ అవుట్ బాలలు, కార్మికులుగా పని చేస్తున్న చిన్నారులను గుర్తించి పునరావాసం కల్పించాలన్నారు. గ్రామ/వార్డ్ సచివాలయాల పరిధిలో బాల్య వివాహాల సమాచారం లభించిన వెంటనే ఆ వివాహాలను నిలిపివేసి, సంబంధితులపై కేసులు పెట్టాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి శాఖ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. టీనేజీ ప్రెగ్నెన్సీ, ట్రాఫికింగ్, డ్రగ్స్, దోపిడీ లాంటి అంశాలపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. బాధిత బాలికలకు వన్ స్టాప్ సెంటర్ల ద్వారా తక్షణ ఆశ్రయం, చికిత్స, న్యాయ సహాయం కల్పించాలని, కేసులపై మహిళా పోలీసులు నిరంతరం ఫాలో అప్ చేయాలన్నారు. డ్రాప్ అవుట్ బాలికల సమస్యలపై డీఈఓ, కర్మాగారాల్లో పనిచేస్తున్న బాలికల విషయమై లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు జిల్లా స్థాయిలో కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పీడీ శాంతి శ్రీ, డాక్టర్ అనిత, సీఈఓ శ్రీధర్ రాజా, పీడీ కిరణ్ కుమార్,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర శ్రీకాకుళం
పేజి: 2
శనివారం 10, మే 2025

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పద్మనాభరాజు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఎచ్చెర్ల సాయుధ పోలీసు క్వార్టర్స్లో నూతనంగా ఏర్పాటుచేసిన ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్గా సీహెచ్వీఎస్ పద్మనాభరాజు పదోన్నతిపై నియమితులయ్యారు. ఈ మేరకు ఈయన శుక్రవారం బెటాలి యన్ నిర్మాణం, నిర్వహణ కార్యకలాపాలపై సిబ్బందితో చర్చించారు. శాంతి భద్రతల పరిరక్షణ, బందోబస్తు నిర్వహణ, తీవ్రవాద నిర్మూలన, అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట, అన్ని రకాల పోలీసింగ్ కార్యక్ర మాల్లో పోలీసు యంత్రాంగానికి సహాయకారిగా బెటాలియన్ కార్యకలాపాలు సాగుతాయని చెప్పారు.

బిఎస్ఎన్ఎల్ వినియోగదారులకు సేవలు కరువు..

విశాలాంధ్ర-మందస: మండలంలో బిఎస్ఎన్ఎల్ సేవలు వినియోగదారులకు కరువు అవుతున్నాయి. బిఎస్ఎన్ఎల్ సెల్ ఫోన్లు ఎప్పుడు పలుకుతాయో.. వాట్సాప్ సెల్ ఉన్న వారికి నెట్ వర్క్ ఎప్పుడు ఉంటుందో.. తెలియని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ బిఎస్ఎన్ఎల్ రకరకాల ఆఫర్ లతో వినియోగదారుల నుంచి సెల్ రీఛార్జిల పేరిట డబ్బులు వసూళ్లు చేయడం తప్ప వినియోగదారులకు సేవలు అందించడంలో విఫలం చెందుతోంది. మండలంలో ప్రైవేటు సెల్ ఫోన్ నెట్ వర్క్ లు బాగా పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ మాత్రం సక్రమంగా పనిచేయడం లేదు. మండల కేంద్రమైన మందసలో బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఉన్నప్పటికీ వినియోగదారుల ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ కార్యాలయానికి వెళ్లే దారి దుర్గంధపూరితంగా ఉంటుంది. కార్యాలయం ముందు బాగాన పరిశుభ్రత లేదు. మురుగు నీరు నిల్వతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయి ఉన్నాయి. ఇదే పరిస్థితి మండలం హరిపురం, బేతాళపురం, బుడార్ సింగి కేంద్రాల్లో ఉన్న బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు పరిసరాలు కూడా పరిశుభ్రత లేకుండా ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వినియోగదారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో జాడలేని కొత్త సామాజిక పింఛన్లు..

పింఛన్లు మంజూరు కాక సంచార జీవనం గడుపుతున్న నిరుపేదలు..!

విశాలాంధ్ర-పలాస/మందస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 11 నెలలు కావస్తున్నప్పటికీ అర్హులైన పేదలకు కొత్తగా సామాజిక పింఛన్లు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వంపై ఆ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత చోటుచేసుకుంది. సామాజిక పింఛన్లు మంజూరు కాక ఆర్థిక స్తోమత లేక కటిక పేదరికం అనుభవిస్తున్న నిరుపేదలు గ్రామాల్లో సంచార జీవనం గడుపుతున్నారు. మరి కొంత మంది పేదలు అనారోగ్యంతోను వృద్ధాప్యంతోను సుదూర ప్రాంతాలకు నడవలేక గ్రామాల్లో స్థానికంగా ఉన్న ఆలయాలు వద్ద బిక్షాటన చేస్తున్నారు. ప్రస్తుతం సామాజిక పింఛన్లు ప్రభుత్వం ద్వారా అందుకుంటున్న నిరుపేదలు పింఛన్ పైనే నెలవారి జీవనాధారం గడుపుతున్నారు. దీనిలో భాగంగా వారికి అనారోగ్య సమస్యలు ఉంటే పింఛన్ డబ్బులతోనే మందులు కొనుగోలు చేసుకునే పరిస్థితిలో అక్కడక్కడ ఉన్నాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో నిరుపేద వర్గాలకు సామాజిక పింఛన్లు కొత్తగా మంజూరు చేయకుండా రకరకాల నిబంధనలు ఆంక్షలు విధించడం వల్ల పింఛన్లు మంజూరు కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేదలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వితంతు, ఒంటరి మహిళలకు 60 ఏళ్లు దాటిన వృద్ధులకు, డప్పు కళాకారులకు, అంగ వైకల్యంతో బాధపడుతున్న వికలాంగ బాధితులకు, కిడ్నీ క్యాన్సర్ బాధితులకు, నడవలేని స్థితిలో మంచం పట్టిన వికలాంగులకు తదితర రకాల పింఛన్లు మంజూరు చేయాలి. కొత్త పింఛన్లు అర్హులైన వారందరికీ దక్కాలి కానీ ప్రభుత్వం రకరకాల నిబంధనలతో ఆంక్షలతో పరిమితంగా అతి కొద్ది మందికే పింఛన్లు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుత నిబంధనల ప్రకారం వృద్ధాప్య ఫించను పొందుతున్న భర్త అనారోగ్యంతో మరణిస్తే వారసురాలైన భార్యకు మాత్రమే పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం మార్గ దర్శకాలు ఇటీవల జారీ చేసి వారసులైన భార్యల నుంచి గ్రామ సచివాలయంలో దరఖాస్తులు గత నెల చివరి తేదీ వరకు స్వీకరించారు.2024 సంవత్సరం నవంబరు నెల ఒకటో తేదీ నుంచి పింఛను పొందిన వృద్ధులైన భర్తలు చనిపోతే వారసులైన భార్యల నుంచి రెండు నెలల క్రితం దరఖాస్తులు తీసుకొని కొత్త ఫింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసింది.మళ్లీ ఇప్పుడు 2023 సంవత్సరం డిసెంబర్ నెల నుంచి 2025 సంవత్సరం ఏప్రిల్ నెల వరకు పింఛన్లు పొందుతున్న వృద్ధులైన భర్తలు మరణిస్తే వారసులైన భార్యలు నుంచి పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం గ్రామ సచివాలయం ద్వారా దరఖాస్తులు స్వీకరించారు.కేవలం ఈ క్యాటగిరి వరకే ఫింఛన్లు మంజూరు కోసం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పింఛన్లకు నోచుకోని అర్హులైన నిరుపేదలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వితంతువులు ఒంటరి మహిళలకు 60 ఏళ్లు దాటిన వృద్ధులకు వివిధ రకాల దివ్యాంగ బాధితులకు కిడ్నీ క్యాన్సర్ బాధితులకు డప్పు కళాకారులకు తదితర రకాల అర్హులైన పింఛన్ దారులకు కొత్త పింఛన్లు మంజూరు చేయకుండా కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తుంది. గత సంవత్సరం జూన్ 12న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు కొత్త పింఛన్ల కోసం ఆశించిన పేదలకు పింఛన్లు మంజూరు చేయకపోవడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కిడ్నీ క్యాన్సర్ వ్యాధు లతో బాధపడుతున్న బాధితులు పింఛను మంజూరు కోసం ఎదురు చూసి చూసి ఎంతో మంది గ్రామాల్లో మరణిస్తున్నారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు రకరకాల వ్యాధులు బారిన పడి తిండి కోసం మందుల కోసం డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నారు. వికలాంగులకు చేయూతనిచ్చే వారు కరువయ్యారు. కొత్త పింఛన్ల కోసం ఆశపడుతున్న వికలాంగులకు జీవనోపాధి కష్టతరంగా మారింది.దశాబ్దాల తరబడి అనేక మంది కుటుంబాలు సామాజిక పింఛన్లు పొందుతూ కుటుంబాలతో జీవనం గడుపుతున్నారు. కొత్త పింఛన్లు

దారులైన వారికి మంజూరు కాకపోవడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత వైసిపి ప్రభుత్వం హయాంలో 2023 సంవత్సరం అక్టోబర్ నెల నుంచి 2024 సంవత్సరం మార్చి నెల వరకు వివిధ రకాల సామాజిక పింఛన్లు మంజూరు కోసం రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పేదలు గ్రామ సచివాలయాలకు దరఖాస్తులు అందజేశారు. అప్పట్లో పింఛన్లు మంజూరుకు ఆన్ లైన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి గ్రామ సచివాలయం ఉద్యోగులు తీసుకువెళ్లారు. పింఛన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వేలాది మంది పేదలకు ఇంత వరకు పింఛన్లు మంజూరు కాలేదు. 2024 సంవత్సరం జూన్ 12 ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దరఖాస్తులను ఇంత వరకు పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదు సరి కదా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 11 నెలలు కావస్తున్నప్పటికీ కొత్తగా ఈ ప్రభుత్వం సామాజిక పింఛన్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీంతో పింఛన్ల కోసం ఆశపడ్డ నిరుపేదలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పటికైనా స్పందించి నిరుపేదల పట్ల సానుభూతి చూపించి అర్హులైన వారందరికీ కొత్తగా సామాజిక పింఛన్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-మందస: మండలం మూలిపాడు గ్రామంలో దాతలు సహకారంతో సుమారు 15 లక్షల వ్యయంతో నిర్మించిన ముక్తేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక భజన బృందాలు భక్తి గీతాలాపన చేశారు.పలు రకాల సాంస్కృతి కార్యక్రమాలు జరిగాయి.పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రాంగణంలో నారాయణ సేవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల కు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రజా ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

జిల్లా ఎస్పి కెవి మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-పలాస: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కే.వీ మహేశ్వర్ రెడ్డి అధికారులు సూచించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో రెండు రోజులు ప్రజా ఫిర్యాదులు నమోదు, పరిష్కార వేధిక నిర్వహణ ఉంటుందని, ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పరిసర ప్రాంత ప్రజల కొరకు కాశీబుగ్గ పోలీసు స్టేషనులో నిర్వహించే ప్రజా ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి ఆయన కోరారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని, ఆయా పిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ప్రజలు వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖా ముఖి మాట్లాడి,ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ లో వచ్చే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక ద్వారా పంపించాలని ఎస్పి తెలిపారు.

శేష వాహన సేవలో శ్రీవారు

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శేష వాహన సేవలో శ్రీవారు ఊరేగింపు నిర్వహించారు. శ్రీమాన్ చామర్తి శ్రీనివాసాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, చామర్తి సత్యసాయి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవాల్లో శ్రీవారి ఊరేగింపులో తప్పిటగుళ్ళు, కోలాటం, నాదస్వరం పలువురి ఆకట్టుకు న్నాయి. ఈ ఊరేగింపు కార్యక్రమంలో అడుగడున మహిళలు స్వామివారికి హారతులు అందించి, భక్తి, శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మోత్సవ సారధులు, జోస్యుల జగన్నాధశర్మ, మావుడూరు జగదీష్‌శర్మ, అస్థాన పురోహితులు, జోస్యుల సుందర వేణుగోపాలశర్మ, జోస్యుల జగన్నాధశర్మ, ఆలయ ధర్మకర్తలు, పొట్నూరు వీరభద్రస్వామి, పొట్నూరు కృష్ణప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

లింగాలవలస అంగన్వాడి కేంద్రంలో ప్రత్యేక సమావేశం

విశాలాంధ్ర-జలుమూరు : మండలం లింగాలవలస గ్రామ అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాలకిషోర్ కార్యక్రమం మరియు వాసు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. పర్యవేక్షణ అధికారి బొడ్డేపల్లి సీతారత్నం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మరియు వేసవి సెలవులో నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో బాలబాలికలు పాల్గొని అధికారులు ఇచ్చిన సూచనలు పాటించాలని ఆమె హితువు పలికారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్ల నియామకానికి ధరఖాస్తులు

విశాలాంధ్ర-సోంపేట: సోంపేట న్యాయస్థానాల పరిధిలో పారా లీగల్ వలంటీర్లుగా నియమాకానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా 6వ అదనపు న్యాయమూర్తి కె.కిషోర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. వలంటీర్లుగా పని చేయుటకు రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఇతర రిటైర్డ్ ఉద్యోగులు, వయోవృద్ధులు, ఎన్ఎస్‌డబ్ల్యు విద్యార్థులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు, న్యాయసంబంధిత విద్యార్థులు, సేవాదృక్పదం కలిగిన సభ్యులు, ట్రాన్స్ జెండర్లు ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 10వ తరగతి కనీస అర్హత కలిగిన సోంపేట, బారువ, కంచిలి, మందస ప్రాంతాల వారు ధరఖాస్తుకు అర్హులని తెలిపారు. ఈ నెల 14లోగా ధరఖాస్తుతో పాటు సోంపేట కోర్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు.

సాక్షి పై ప్రభుత్వ కక్ష సాధింపు చర్యలు దారుణం

పోలీసుల వైఖరిని ఖండించిన ఏపీయూడబ్ల్యూజే

విశాలాంధ్ర-పలాస: ప్రజాస్వామ్యానికి పాతరేసి.. నిబంధనలకు నీళ్లొదిలి.. నియంతృత్వ పోకడలతో పాలిస్తున్న కూటమి ప్రభుత్వం సాక్షి పత్రికపై కక్ష సాధింపు చర్యలకు దిగడం దారుణమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు సిహెచ్ జగదీష్, ఐజేయు ప్రతిపాదిత జాతీయ కౌన్సిల్ సభ్యులు డి.మహరణ అన్నారు. శుక్రవారం పలాస కాశీబుగ్గ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడం దారుణమన్నారు.ప్రభుత్వ అవినీతిపై వరుసగా సాక్షిలో కథనాలు రావడంతోనే ప్రభుత్వం పత్రిక ఎడిటర్ ఇంటిపై దాడికి దిగిందని, ఇది అమానుషమని పేర్కొన్నారు. ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టడం చాలా దారుణమని, అప్రజాస్వామికమని పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారన్న కారణంతో కక్ష సాధింపుగా ఎడిటర్ ఇంట్లోకి పోలీసులు వచ్చి భయానక వాతావరణాన్ని సృష్టించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసుల వైఖరికి వివిధ ప్రజాసంఘాలు ఖండించాలని కోరారు. పలాస, కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్, ప్రింట్ మీడియా, ప్రెస్ క్లబ్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు నేతాజీ, సాక్షి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ రాజారావు, తిరుమల ఎస్. రమేష్(రవి), అభ్యుదయం రచయిత సంఘము జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ కృష్ణారావులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి పద్ధతులు మానుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజాలను వెలికితీస్తున్నందుకే పత్రికల గొంతు నొక్కేందుకు అక్రమ కేసులు పెట్టి వేధించేందుకు ప్రభుత్వం ఇలాంటి చర్యలు చేపడుతోందన్నారు. ఇలాంటివి మానుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరారు. అనంతరం పలాస ఆర్.డి.ఓ. జి. వెంకటేష్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు, రంగం కళావేదిక రాష్ట్ర నాయకులు సూదన్, రైతు సంఘము నాయకులు కె. బాలాజీ, పిడి ఎస్ యు రాష్ట్ర నాయకులు ఎమ్. వినోద్, సీఐ టియు నాయకులు ఎన్. గణపతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా జిల్లా వూషు క్రీడా పోటీలు

- క్రీడలతోనే బంగారు భవిష్యత్
- రాష్ట్రస్థాయి వూషు పోటీలో చిక్కోలు ఖ్యాతిని ఇనుమడింపజేయండి
- జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి కె శ్రీధర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: నగరంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) ప్రాంగణంలో శుక్రవారం జిల్లా వూషు అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు పొగిరి కృష్ణంనాయుడు, రెడ్డి శివకుమార్‌ల ఆధ్వర్యంలో 11వ సబ్ జూనియర్,10వ జూనియర్, 9వ సీనియర్ వూషు జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వూషు క్రీడా పోటీలకు సభాధ్యక్షులుగా సీనియర్ జర్నలిస్ట్, శ్రీకాకుళం జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు వ్యవహరించారు. గురువుల ప్రతిభ , శిష్యులు వలనే తెలుస్తుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్రీడలకు మహర్దశ వచ్చిందని అన్నారు. ఈ పోటీలకు ముఖ్య అతిధులుగా విచ్చేసిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి డాక్టర్ కె.శ్రీధర్ మాట్లాడుతూ ఇప్పుడు క్రీడలు నేర్చుకునే వాళ్ళకి మంచి అవకాశం ఉన్నాయని ప్రతి విద్యా రంగంలో స్పోర్ట్స్ కోటా పెట్టారని క్రీడలకు మూడు శాతం కోటా ఉంటుందని ఆయన అన్నారు. త్వరలో జరగనున్న డిఎస్సీ పరీక్షల్లో మూడు శాతం క్రీడారంగం కోటా కేటాయించడం వల్ల క్రీడలకు మహర్దశ రానున్నదని అన్నారు.జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్య దర్శి మెంటాడ సాంబమూర్తి మాట్లాడుతూ వూషు క్రీడా మంచి క్రమశిక్షణతో కొన్నేళ్లగా ఆర్ట్స్ కాలేజీలో శిక్షణ ఇస్తున్నారని, మన జిల్లాలో ఉన్న వూషు క్రీడాకారులు జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన వారు ఉన్నారని, క్రీడలు నేర్చుకున్న ప్రతి క్రీడాకారుడు క్రమశిక్షణతో ఉంటూ, గురువులను దైవంగా చూడాలని,ఈ నెల 12 నుంచి 14 గు వరకు కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి ఊసు పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలని ఆయన అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల మాట్లాడుతూ అందరూ డాక్టర్లు, పోలీసులు, ఇంజనీర్లు అవ్వాలని ఏమీ లేదని , మంచి క్రీడాకారులుగా ఉంటూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చునని అన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థా యిలో పథకాలు సాధించినట్లయితే స్పోర్ట్స్ కోటలో ఉద్యోగులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఊసు ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారే రాష్ట్రస్థాయిలో పాల్గొనడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, రెడ్డి సాయి కుమార్, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి, సీనియర్ క్రీడాకారులు మురళి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాక్సిస్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలి

విశాలాంధ్ర-టెక్కలి : రాష్ట్ర ప్రభుత్వంతో యాక్సిస్ విద్యుత్ ఒప్పందం రద్దు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. యాక్సిస్, సెకి ఒప్పందాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని, ట్రూ ఆఫ్, సర్ చార్జీల రద్దు చేయాలని కోరుతూ టెక్కలిలో సిపిఎం నిరసన తెలియజేసారు. ఈ సందర్భంగా యూనిట్ విద్యుత్‌ను రూ.4.60లు చొప్పున కొనుగోలు చేసేందుకు యాక్సిస్ కంపెనీతో రాష్ట్ర డిస్కామ్ లు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు గారు విద్యుత్ చార్జీలు పెంచము సరి కదా తగ్గిస్తామని వాగ్దానం చేసి, అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ చార్జీలను రెట్టింపు చేయడం ప్రజలను దగా చేయడం కాదా అని వారు ప్రశ్నించారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు పగలగొట్టండని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు పెట్టడం దుర్మార్గమైనదని వారు విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై పాతికేళ్ళపాటు రూ.15 వేల కోట్లు భారం వేసే ఈ ఒప్పందాన్ని విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఏపిఈఆర్సి) ఆమోదముద్ర వేయడం అన్యాయం అని అన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం (2003)లోని 108వ సెక్షన్ను ప్రయోగించడం గర్హనీయం. యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్ నుండి యూనిట్ విద్యుత్ను రూ.4.60లు చొప్పున కొనుగోలు చేసేందుకు ఏపిఎస్పిడిసిఎల్ చేసుకున్న ఒప్పందాన్ని ఆమోదిస్తూ ఏపిఈఆర్సి శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పాతికేళ్ళపాటు 400 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు ద్వారా యాక్సిస్ కంపెనీకి రూ.15 వేల కోట్లు పైగా లబ్ది కలుగుతుంది. గతంలో టిడిపి ప్రభుత్వం ఉన్నప్పుడే 2018లో ఈ దోపిడీకి ప్రయత్నించగా ప్రభుత్వం మారాక కోర్టుల చుట్టూ తిరిగింది. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక యాక్సిస్ కంపెనీ పాత ప్రతిపాదనను డిస్కామ్ ఆమోదించింది.రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చట్టం (2003)లోని సెక్షన్ 108 కింద రిఫర్ చేయడం ద్వారా ఏపిఈఆర్సి కూడా ఆమోదముద్ర వేయాల్సిన తప్పనిసరి పరిస్థితిని కల్పించింది. రాష్ట్ర ప్రజలపై రూ.15 వేల కోట్లు భారం మోపి, యాక్సిస్ కంపెనీకి కట్టబెట్టడానికి టిడిపి కూటమి ప్రభుత్వం చేయించిన ఈ ఒప్పందం ఎంతమాత్రమూ అనుమతించరానిది వారన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో యూనిట్ రూ.2 లు, 2.50లకి ఒప్పందాలు జరుగుతున్నాయి. గతంలో అదానీ సంస్థతో సెకీ ద్వారా సోలార్ విద్యుత్ యూనిట్ రూ.2.49లు ఒప్పందం చేసుకోగా అది అధిక రేటు అని తెలుగుదేశంతో సహా అన్నిపక్షాలు విమర్శించాయి. నేడు దానికంటే రూ.2.10లు అధికంగా చేసే ఒప్పందాలు చేసుకోవడం గర్హనీయం. సోలార్ ప్యానెల్స్, ఇతర ఉత్పాదకాల ఖర్చు భవిష్యత్తులో ఇంకా తగ్గే వీలున్నందున విద్యుత్ రేట్లు ఇంకా తగ్గుతాయి. ఆ ప్రయోజనం కూడా వినియోగదార్లకు దక్కకుండా రూ.4.60లు రేటుకు పాతికేళ్ళు కొనసాగేలా యాక్సిస్తో ఒప్పందం చేయడం దారుణం అన్నారు. అన్ని విధాలా నష్టదాయకమైన ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలి. అందుకోసం ప్రజలు, విద్యుత్ వినియోగదార్లు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అన్నారు. అదేవిధంగా స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, ట్రూ ఆప్ చార్జీలు సర్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కొల్లి యల్లయ్య, వెంకట్రావు ప్రసాద్, ధర్మారావు, రాజు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయానికి 'పద్మావతి' విధ్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని, పంచిరెడ్డి హేమలత పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయానికి ఎంపికైందని కళాశాల డైరక్టర్, సిహెచ్.దుర్గాప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయంలో మ్యాథ్స్ హానర్స్ డిగ్రీ కోర్సుకు ఎంపికైందని అన్నారు. భోధన, వసతి, వైద్య సదుపాయాలు ఈ విశ్వవిద్యాలయంలో పూర్తిగా అందించి, విధ్యార్థుల్లో ఆధ్యాత్మికత పెరిగేలా చూస్తారన్నారు. రాత, మౌఖిక పరీక్షల ద్వారా హేమలత ఎంపికైందని అన్నారు. ఎంపికైన హేమలతకు కళాశాల ఛైర్మన్, పల్లి సూరిబాబు, అధ్యాపకులు అభినందనలు తెలియచేశారు.

మాదకద్రవ్యాల రవాణాపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలి

- టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వండి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు జిల్లాలో కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా ర్థులు, వర్కర్లు, ఆటో డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని మత్తుపదార్థాలు సరఫరా జరుగుతున్నట్లు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ విక్రయాలు జరిగే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాసం కల్పించాలన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మెడికల్ షాపులన్నింటిలోనూ సీసీ కెమెరాలు అమర్చాలని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా 18 సంవత్సరాల లోపువారికి మందులు ఇవ్వరాదని సూచక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియాలో డ్రగ్స్ రహిత సమాజంపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఆశ వర్కర్లు, మహిళా పోలీస్‌లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లతో పర్యవేక్షణ జరిపించాలన్నారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలను అరికట్టే సమాచారం తో కూడిన పలు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈగల్ టీంలు మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక నిఘా నిర్వహిస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్ సమాచారం కోసం 112 లేదా 1972 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. రిమ్స్‌లోని డీ-అడిక్షన్ సెంటర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. హాస్టళ్లలో డ్రగ్స్ వాడకంపై పర్యవేక్షణ జరిపిస్తామన్నారు. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్ల పరిసరాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

- రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి...

జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగింది. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎస్పీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రహదారులపై ప్రమాదాలకు అవకాశాలు ఉన్న చోట్ల ఎన్ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేయాలన్నారు. డివైడర్లను తొలగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ శాఖలు ఇటీవల జరిగిన ప్రమాదాల విశ్లేషణ చేసి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద సమయంలో 108 వాహన సేవలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించారు. స్కూల్స్, కాలేజీల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెట్రోలు బంక్‌ల వద్ద సీసీ కెమెరాలు, మలుపుల వద్ద బ్యారికేడ్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి డ్రైవర్ల కోసం రెస్ట్ ఏరియాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కమర్షియల్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయడం కోసం వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల వద్ద రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సినిమా థియేటర్లలో లఘు చిత్రాల ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా జాతీయ రహదారుల టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వాటి పనితీరును గురించి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ ఈ జాన్ సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ విజయ సారథి, ఎన్ హెచ్ ప్రాంతీయ ప్రాజెక్టు డైరెక్టర్ తివారి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, డి.ఎస్.పి సిహెచ్ వివేకానంద, డిఎంహెచ్వో అనిత, పలువురు సీఐలు, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

గోడపత్రిక విడుదల చేస్తున్న కలెక్టర్, తదితరులు